క్లుప్తంగా

26న డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలు, ఆర్టీసీకి సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఈనెల 26వతేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే కార్యక్రమానికి డిపో పరిధిలోని సర్వీసుల వల్ల సమస్యలు, ఆర్టీసీ ఆదాయం పెంచడానికి సూచనలు,సలహాలు ఇవ్వాలని కోరారు. 9959225676 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

రేపు వారపు సంత వేలం

ములకలచెరువు: ములకలచెరువు వారపు సంత వేలం పాటలను బుధవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఆజాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 –26 ఆర్థిక సంవత్సరానికి గాను వేలం పాటను ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రహమత్‌బీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు కోసువారిపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె పంచాయతీలో బుధవారం ఉదయం 10 గంటలకు వారపుసంత, బయ్యమ్మచెరువు చేపల పెంపకానికి వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు రూ.1000 చెల్లించాలన్నారు.

బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి నియామకం



నియామక పత్రం అందుకుంటున్న పాలకుంట శ్రీనివాసులు

పీలేరు రూరల్ : భారతీయ అంబేడ్కర్‌సేన (బాస్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పీలేరుకు చెందిన పాలకుంట శ్రీనివాసులును నియమించినట్లు బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.టి.ఎం శివప్రసాద్ తెలిపారు. గుంటూరులో జరిగిన బాస్ సమావేశంలో పాలకుంట శ్రీనివాసులకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.టి.ఎం. శివప్రసాద్ మాట్లాడుతూ బాస్‌లో శ్రీనివాసులు వివిధ పదవులు చేపట్టి చురుగ్గా పని చేసి బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అభినందించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై మరింత బాధ్యత పెరిగిందని, పేదల సమస్యల పరిష్కారానిక నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా గంగజాతర



పూజలందుకుంటున్న గంగమ్మ

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట కస్పాలో గంగజాతర వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారిజామున గ్రామం నడివీధిలో గంగమ్మ ప్రతిమను ఏర్పాటు చేశారు. వేప, మామిడి తోరణాలు, పుష్పాలతో విశేషకంగా అలంకరించారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. రాత్రి ఆసాదికథ చెప్పి అమ్మ వారిని మేల్కొలిపారు. అలాగే గర్నిమిట్ట యల్లమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచాయతీకి రూ.3.95 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె: పంచాయతీ బస్టాండు గేటు వేలం పాట ద్వారా తంబళ్లపల్లె పంచాయతీకి రూ.3.95 లక్షలు ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీఓ నాగరాజు, సర్పంచు నీలూఫర్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. మహేష్ రూ.3.95 లక్షలకు వేలం పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీమ్, ఈఓఆర్‌డీ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27న ఫ్యాప్టో జిల్లా కమిటీ ఎన్నిక

రాయచోటి అర్బన్ : ఈనెల 27న జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం జరుగుందని జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్, సెక్రటరీలు అంకం శివారెడ్డి, రవిశంకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4:30 గంటలకు పట్టణంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. నూతన కమిటీకి ఎన్నిక నిర్వహణ అధికారిగా రూటా రాష్ట్రనేత ఇక్బాల్ హాజరుకానున్నట్లు తెలిపారు.

క్షయవ్యాధి నివారణ సామాజిక బాధ్యత



తంబళ్లపల్లె: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



పీలేరు: క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమంలో అధికారులు



కేవీపల్లె : గర్నిమిట్టలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



ములకలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తంబళ్లపల్లె: క్షయ నివారణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణనాయుడు కోరారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సీహెచ్‌సీ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రెండు వారాలు దగ్గు రావడం, జ్వరం రావడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనబడిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు చేసుకోవచ్చునన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే డాట్ చికిత్సలు ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఈపీ ఎల్‌టి యాదగిరి, డాక్టర్లు అమరసింహరాజు, విక్రాంత్‌రెడ్డి, సుమలత,, ఐసీటీసీ కౌన్సిలర్ చందు, ఎల్‌టీఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిని ఓడించాలి

పీలేరు : టీబీ వ్యాధిని దాచకుండా ఓడించాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధికి సంబంధించిన వివక్షతను సమష్టి కృషితో అంతం చేద్దామని పిలుపునిచ్చారు. తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ఎవరికైనా టీబీ రావడం సహజమని, దాన్ని అధిగమించడం రోగి బాధ్యత అని తెలిపారు. అనంతరం టీబీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలందించిన ఆరోగ్య సిబ్బంది 25 మందికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సర్వతమ్మ, ఆర్ఎంఓ డాక్టర్ నాగవేణి, డాక్టర్ కేశవులు, డాక్టర్ కరీముల్లా, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున, షరీఫ్‌జాన్, పవన్, మిహన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే క్షయ వ్యాధి నివారణ

ములకలచెరువు: క్షయ వ్యాధి నివారణకు తగు జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని ప్రభుత్వ డాక్టర్ జాహ్నవిరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆరోగ్య, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ... రెండు వారాలకు మించి దగ్గు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధికి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ పేర్కొన్నారు.

సమష్టి కృషితో క్షయ వ్యాధిని అంతం చేద్దాం

కేవీపల్లె : సమష్టి కృషితో క్షయ వ్యాధిని అంతం చేద్దామని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలి తుంపర్ల ద్వారా సమాజంలో వేగంగా వ్యాప్తి చెందే వ్యాధుల్లో క్షయ వ్యాధి ఒకటని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినపుడు రక్తం పడడం, ఛాతిలో నొప్పి లాంటి లక్షణాలు ఉంటే సమీప పీహెచ్‌సీలో సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్ష చేపించుకోవాలన్నారు. ఈ వ్యాధి కల్గిన వ్యక్తులకు ఉచిత చికిత్స తోపాటు ప్రభుత్వం నెలకు రూ. వెయ్యి చొప్పున ఆరు నెలల పాటు ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో అంకితభావంతో పని చేసిన తమ పీహెచ్‌సీ సిబ్బంది రహీనబేగం, భావన, లోకేశ్వరిలకు జిల్లా స్థాయి ప్రశంసాపత్రాలు లభించినట్లు తెలిపారు. పీలేరు సీహెచ్‌సీలో సూపర్‌వైజర్ పురుషోత్తం జ్ఞాపిక అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చన, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ, రమాదేవి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

27న షబ్-ఏ-ఖదర్

మదనపల్లె సిటీ: ముస్లింలు షబ్-ఏ-ఖదర్ పండుగను ఈనెల 27వతేదీ (గురువారం) జరుపుకోవాలని ప్రభుత్వ ఖాజీ జలాలుద్దీన్‌సాహెబ్ తెలిపారు. పండుగ రాత్రి అత్యంత భక్తి శ్రద్ధలతో జాగారం, నమాజు చేసి విశ్వశాంతికి అల్లా వద్ద దువా చేయాలన్నారు.

నేడు పీటీఎంలో గంగ జాతర

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో మంగళ, బుధవారం గంగ జాతర వైభవంగా నిర్వహించనున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగాగా చర్యలు చేపట్టారు. జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు అదనపు పోలీసు బలగాలతో గస్తీ, ప్రధాన కూడళ్లలో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ



హెల్పింగ్‌మైండ్స్ వారు పంపిణీకి సిద్ధంగా ఉంచిన రంజాన్‌తోఫా

మదనపల్లె సిటీ: పవిత్ర రంజాన్‌మాసం పురస్కరించుకుని హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సోమవారం రంజాన్‌తోఫాను అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ మాట్లాడుతూ నిరుపేదలకు 12 రకాల నిత్యావసర సరుకులతో తోఫా రూపంలో అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రంజాన్‌మాసంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ఆబిద్, దినకర్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి మనవళ్లు ఆస్తి కాజేశారు

- ఆరునెలలుగా అన్నం పెట్టేవాళ్లు కరువయ్యారు
- గ్రామస్తుల దయాదాక్షిణ్యాలతో ప్రాణాలు నిలుపుకుంటున్నాం
- న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వృద్ధ దంపతుల విన్నపం



వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : కుమారుడు, మనవళ్లకు భాగపరిష్కారంలో ఆస్తి పంచేసినవ్పటికీ, తమ జీవనాధారం కోసం మిగుల్చుకున్న భూమిని కొడవలి చూపి మరీ బెదిరించి మనమళ్లు ఆస్తి కాజేశారని వృద్ధ దంపతులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఎదుట వాపోయారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌కు వచ్చి వృద్ధులు తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు వివరించారు. మనవళ్ల నుంచి ప్రాణరక్షణ కల్పించండంటూ కన్నీటిపర్యంతమయ్యారు. పీలేరు నియోజకవర్గం కేవీ.పల్లె మండలం గ్యారంపల్లె పంచాయతీ సంకేన గుట్టపల్లెకు చెందిన ఎగువపల్లె రాజారెడ్డి(90), ఎల్లమ్మ(85) దంపతులు. వీరికి వెంకటరమణారెడ్డి కుమారుడు ఉన్నాడు. వీరికి మునేళ్లపల్లెలో 15 ఎకరాల సాగుభూమి, బావి, సొంతిళ్లు ఉంది. కుమారుడు వెంకటరమణారెడ్డికి శాంతమ్మతో వివాహం కాగా, వీరికి దామోదర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి ముగ్గురు కుమారులు. చిన్నవయస్సులోనే కోడలు శాంతమ్మ మరణించడంతో కుమారుడు వెంకటరమణారెడ్డి పక్క గ్రామానికి చెందిన లక్ష్మీదేవిని రెండో వివాహం చేసుకున్నారన్నారు. తమ పేరుమీద ఉన్న ఆస్తిలో కొంతబాగాన్ని కుమారుడు వెంకటరమణారెడ్డి, ముగ్గురు మనవళ్లకు రాసిచ్చామన్నారు. తర్వాత ముగ్గురు మనవళ్లు, రెండో పెళ్లి చేసుకున్నందుకు తండ్రిని ఇంటి నుంచి బయటకు తరిమేశారన్నారు. అనంతరం మొదటి మనవడు దామోదర్‌రెడ్డి తమ పేరుమీద ఉన్న ఆస్తిలో కొంతభాగాన్ని ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించి రాయించుకున్నాడన్నారు. కొంతకాలానికి మిగిలిన ఇద్దరు మనవళ్లు గిరిధర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డిలు కళ్లకు ఆపరేషన్ చేయిస్తామని మోసం చేసి ఆస్తిని రాయించుకున్నారన్నారు. ప్రస్తుతం ఆస్తిపాస్తులు పోగొట్టుకుని ఖాళీగా ఉన్న తమకు పట్టెడన్నం పెట్టే వారే కరువయ్యారన్నారు. తిరుపతిలో నివాసం ఉంటున్న కుమారుడు తమ బాగోగులు చూసేందుకు ముందుకు వస్తే మనవళ్లు రానివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. వయోభారంతో నడవలేని స్థితిలో ఉన్న తమను ఆరునెలలుగా పట్టించుకునేవారు లేక చివరకు గ్రామస్తులు కొందరు దయతలచి అన్నం పెట్టి ఆదుకుంటున్నారన్నారు. వృద్ధుల సమస్యను సావధానంగా తెలుసుకుని, తప్పక న్యాయం చేస్తానని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు.

దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో దుర్వినియోగం అయిన రూ. 1.40 కోట్లు రికవరీ చేయాలి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ అభివృద్ధి కోసం ఖర్చు చేయకుండా సర్పంచ్ తన సొంత ఖజానాలో జమ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. డీజిల్ బిల్లు, ప్లాన్ అప్రూవల్, ఇంటి పన్నులు, పంచాయతీ ఖాజానాలో జమ చేయకుండా సర్పంచ్ సొంత ఖాజానాలో జమ చేసుకున్నారని ఆరోపించారు. 2024 జూలైలో డీఎల్‌పీవో, ఇతర అధికారులు నిదులు దుర్వినియోగంపై విచారణ జరిపి ముగ్గురు పంచాయతీ అధికారులను సస్పెండ్ చేశారని, సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారన్నారు. అయితే తొమ్మిది నెలలు అవుతున్నా సర్పంచ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, గుర్రప్ప, మాధవ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, పరదేశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉలవ పంట సాగుపై ఏడీఏ ఆరా



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఉలవ పంటలను సాగు చేసిన రైతుల పొలాలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయశంకర్‌రెడ్డి, చిత్తూరు ఏవో భారతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గత ఏడాది రాయితీపై ఉలవలు పొందిన రైతులు పంటను సాగు చేసారా, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు ఈ క్రాప్ బుకింగ్ చేసారా, దిగుబడి ఎలా ఉంది అని ఆరా శారు. మండలంలోని రంగసముద్రం,మడుమూరు, రాపూరివాండ్లపల్లి, కాట్నగల్లు పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. అదునులో సాగు చేసిన రైతులకు మంచి దిగుబడి రాగా అదును తరువాత వేసిన పంటలు అధిక వర్షాల కారణంగా దెబ్బ తిన్నట్లు గుర్తించామన్నారు. వేరుశనగ సాగు కన్నా తక్కువ పెట్టుబడి, అధిక లాభాలను చేకూర్చే ఉలవలను ప్రభుత్వం ఎక్కువగా పంపిణీ చేస్తే సద్వినియోగం చేసుకుంటామని రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఏడీఏతో పాటు మండల ఏవో ప్రేమలత, ఆయా గ్రామాల ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి

రాజంపేట : పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి అన్నారు. సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలకు లోనై వచ్చిన వారిపట్ల ఆప్యాయత చూపి వారి నుంచి సమస్యను సానుకూలంగా వినాలన్నారు.

జీసీటీఏ డైరీ ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: రాష్ట్ర అధ్యాపక సంఘం డైరీని సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆవిష్కరించారు. కాలేజీ స్థాయిలో విద్యార్థులకు విలువతో కూడిన విద్యను అందించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యాపక సంఘం అధ్యక్షులు మలిగి రాఘవరెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి, శైలజ, చిన్నారెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌వల్లి, గురుమూర్తి,కుసుమప్రియ, హజీరాఖానం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లె : కస్తూర్బా విద్యాలయం(కేజీబీవీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి మునివెంకటమ్మ తెలిపారు. మండలంలోని ముష్టూరు కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరంలో 40 సీట్లు, ఏడోతరగతిలో 1, ఎని మిదోతరగతిలో 1, తొమ్మిదిలో 1, పదోతరగతిలో 3, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో 10 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, తల్లిదండ్రుల ఆధార్‌జిరాక్స్, బ్యాంక్ ఖాతా పాసు పుస్తకం జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, ఫోన్‌నెంబర్, పూర్తి చిరునామాతో సహా పాఠశాలకు వస్తే స్థానికంగా ఆన్‌లైన్ చేస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. నాణ్యమైన ఆహారం, ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన, ప్యానల్‌బోర్డులో విద్యాబోధన ఉంటుందన్నారు.

30న మరసం వార్షికోత్సవం



వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మరసం సభ్యులు

మదనపల్లె సిటీ: మదనపల్లె రచయితల సంఘం (మరసం) వార్షికోత్సవాన్ని ఈనెల 30వతేద నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి తెలిపారు. సోమవారం స్థానిక బెంగళూరురోడ్డులోని మరసం కార్యాలయలంలో మరసం వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక చిత్తూరు బస్టాండులోని బొంతవారి సత్రంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉగాది కవి సమ్మేళనం, కవితల పోటీలు, నాటికలు నిర్వహిస్తామన్నారు. సాహితీప్రియులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మరసం అధ్యక్షులు పి.వి.ప్రసాద్, సభ్యులు నాగభూషణరావు, రాఘవేంద్ర, వాసుదేవరావు, శ్రీనివాసులు, కరుణాకర్, ప్రసాద్‌శర్మ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌రంజన్ మిశ్రా నివేదికను రద్దుచేయాలి

- ఎస్సీ వర్గీకరణపై క్యాబినెట్ తీర్మానాన్ని రద్దుపరచాలి
- సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకం
- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మాలమహానాడు నిరసన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్ మిశ్రా రాష్ట్రప్రభుత్వానికి సమర్పించిన ఏకపక్ష నివేదికను వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు జాతీయవర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుకు చెందిన ఏడుమంది జడ్జిలు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారం లేదన్నారు. 2024లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, 2023లో బల్విందర్‌సింగ్ వర్సెస్ పంజాబ్ గవర్నమెంట్ కేసులో ఏడుమంది జడ్జిలు ఇచ్చిన తీర్పులో ప్రధాని మోదీ సహకారంతో మంద కృష్ణ మాదిగ ఇంప్లీడ్ కావడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును మాజీ ముఖ్యమంత్రి, చమ్మర్ సామాజిక వర్గానికి చెందిన మాయావతి వ్యతిరేకించందన్నారు. అంతేకాకుండా దాంతో రాందాస్, సత్యాల, చిరక్‌పాశ్వాన్ తదితరులు వ్యతిరేకించారన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణ, గుంటూరుజిల్లాలో మాలల సింహగర్జన సభలు జరిగాయని, మార్చి 23న తిరుపతిలో రాయలసీమ మాలల సింహగర్జన బహిరంగ సభ జరిపేందుకు తిరుపతి మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ కుట్రపూరితంగా రద్దు చేయించారన్నారు. మనవడి పుట్టినరోజుకు తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అందరినీ సమానదృష్టితో చూడాల్సిన ముఖ్యమంత్రి.. ఒకే కులానికి కొమ్ముకాయడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గుండా మనోహర్, మల్లెలమోహన్, లక్ష్మీపతి, కొప్పులరామచంద్ర, ప్రశాంత్, వెంకటరమణ, నాగరాజు, మణి, సురేష్, సీటీఎం రమణ, శేషాద్రి, శ్రీనివాస్ యాదవ్, అప్పయ్య, సురేంద్ర, గిడ్డు పాల్గొన్నారు.

ఇమాం, మౌజన్లకు దుస్తులు



ఇమాంలకు దుస్తులు అందిస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని 52 మసీదులకు చెందిన ఇమాం, మౌజన్లకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దుస్తులను అందించారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు మండలాల్లోని మసీదులకు చెందిన ఇమామ్‌లు, మౌజన్లు, మదరసా హజరత్లకు, వారి కుటుంబీకులకు రంజాన్ పండుగ సందర్భంగా దుస్తులు, ఖర్జూరం పండ్లను అందజేశారు. వీటిని ఆయా మసీదుల్లో జరిగిన కార్యక్రమాల్లో వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పి.మాలిక్. పిటిఎం ఎంపీపీ మొహమూద్, వక్ఫ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ ఫజుల్లా, రెడ్డిబాషా, చాంద్ బాషా, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, మాజీ ఉప సర్పంచ్ అన్సర్ బాషా, నవాజ్, జిల్లు అందజేశారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



కురవంక సచివాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మదనపల్లె అర్బన్, రూరల్ పరిధిలో సోమవారం గ్రామ, వార్డు సచివాలయాలను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట మండలంలోని కురవంక గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే సచివాలయంలో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో విధులకు హాజరైనట్లు సంతకాలు పెట్టి, సచివాలయంలో అందుబాటులో లేకపోవడంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌ను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో 28వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయాల్లో సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేదిశగా సచివాలయ సిబ్బంది చొరవ చూపాలన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

మాలమహానాడు నాయకుల డిమాండ్



అంబేడ్కర్ సర్కిల్ వద్దన నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

పీలేరు రూరల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. ధరణికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాలమహానాడు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన సంఘటపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య, మాలమహానాడు నాయకులు రాజేశ్వరి, నాగేశ్వరమ్మ, రహమత్, ఖాదర్‌వలి, బాబు, రామ్మూర్తి పాల్గొన్నారు.